ఊపందుకున్న అపార్ట్‌మెంట్ కల్చర్

ఉపాధి అవకాశాలు, పర్యాటక ప్రాంతాలు ఉండడమే కారణం



రావిర్యాల ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో నిర్మించిన ఓ అపార్ట్‌మెంట్

తుక్కుగూడ: మధ్య తరగతి, సంపన్న వర్గాల ప్రజలకు అపార్ట్‌మెంట్ కల్చర్‌పై ఆసక్తి నానాటికి పెరుగుతోంది. ఇప్పటి వరకు జనం వ్యక్తిగత గృహాలకే పరిమితం కాగా రెండేళ్లుగా భూముల ధరలకు రెక్కల రావడంతో అపార్ట్‌మెంట్ వైపు మొగ్గు చూపుతున్నారు. తుక్కుగూడ మున్సిపల్ పరిధిలో నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు, శ్రీశైలం జాతీయ రహదారి, ఆర్‌జీఐ ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్టు రోడ్డు సదుపాయం ఉండడం, అలాగే ఉపాధి కోసం హార్డ్ వేర్ పార్కు, ఈ–సిటీ, మంఖాల్ పారిశ్రామిక వాడ, ఆర్‌సీఐ, టీసీఎస్, పర్యాటక కేంద్రం వండర్ లా ఉన్నాయి. ఈ ప్రాంతంలో పలు రకాల మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు ఉండడంతో అపార్ట్‌మెంట్ నిర్మాణాలు ఊపందుకున్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి వలసలు

మున్సిపల్ పరిధిలోని ఉపాధి కోసం అనేక పరిశ్రమలు ఉండడంతో ఒడిశా, బీహార్, జార్ఖండ్, హర్యానా, యూపీ, ఏపీ ఇలా అనేక రాష్ట్రాల నుంచి వలసలు పెరిగాయి. దీంతో తుక్కుగూడ, రావిర్యాల, మంఖాల్, ఇమామ్‌గూడ ప్రాంతాల్లో ఇల్లు అద్దెకు దొరకడం కష్టంగా మారింది. నిర్మాణ ప్రయాస తగ్గించుకోవడంతో పాటు, సొంతింటి కల నెరవేర్చుకోవడానికి అపార్ట్‌మెంట్‌పై ఆసక్తి చూపుతున్నారు. రావిర్యాలలో అదాఖాన్ ఇంటర్‌నేషనల్ పబ్లిక్ స్కూల్ ఉండడంతో హైదరాబాద్ సమీప ప్రాంతంలోని వ్యాపారులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు చాలా మంది ఇక్కడి స్కూళ్లలో చదువుకుంటున్నారు. దీంతో చాలా మంది ఈ పరిసర ప్రాంతంలో నివాసం ఉంటున్నారు.

పెరిగిన నిర్మాణాలు

మున్సిపల్ కేంద్రంలో ఇప్పటి వరకు చాలా తక్కువ సంఖ్యలో అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. రెండేళ్ల నుంచి పదుల సంఖ్యలో అపార్ట్‌మెంట్‌లో నిర్మాణం జరుగుతున్నాయి. నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో కొన్ని అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే చాలా అపార్ట్‌మెంట్ల నిర్మాణం కోసం హెచ్‌ఎండీఏ, రెరా నుంచి అనుమతులు పొందినట్లు సమాచారం. రాష్ట్ర రాజధానిలో ఉన్న కల్చర్, క్రమంగా శివారు ప్రాంతాలకు కూడా పాకుతోంది.

అపార్ట్‌మెంట్లు పెరుగుతున్నాయి

మున్సిపల్ పరిధిలో ఇప్పటి వరకు అపార్ట్‌మెంట్ల కల్చర్ లేదు. రెండేళ్ల నుంచి అపార్ట్‌మెంట్ల నిర్మాణాల సంఖ్య పెరిగింది. ఈ ప్రాంతంలో ప్రజల నివాసం కోసం ఉపాధి, రవాణా సౌకర్యాలు ఉన్నాయి. దీంతో అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు పెరుగుతున్నాయి.
– రవీందర్ నాయక్, రియల్టర్, తుక్కుగూడ

దశాబ్ది ఉత్సవాల పేరుతో మోసం

బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి



మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: దశాబ్ది ఉత్సవాలంటూ కొత్త కార్యక్రమాలతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తున్నారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ధ్వజమెత్తారు. మన్సూరాబాద్ చంద్రపురికాలనీలోని బీజేపీ పార్టీ జిల్లా కార్యాలయంలో సామ రంగారెడ్డి శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తెలంగాణ ప్రజలను దగా చేయటమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సర్కార్ పనిచేస్తుందని విమర్శించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఎల్‌బీనగర్‌ను ఎంతో అభివృద్ధి చేశానని చెప్పుకుంటూ అసంపూర్తి ఫ్లైఓవర్‌పై డ్రోన్ కెమెరాలతో యానిమేషన్ సినిమా చూపిస్తున్నారని, దాని పక్కనే ఉన్న బైరామల్‌గూడ చెరువుపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. చెరువులను డ్రైనేజీ నీటితో నింపి చెరువుల సుందరీకరణ అంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో ప్రతి ఇంటికి 20 వేల లీటర్ల నీటిని ఉచితంగా అందజేస్తామని చెప్పి నేడు వేల రూపాయల బిల్లులు చేస్తున్నారన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో వరదకాలువ నాలా పనులు అసంపూర్తిగా ఉన్నాయని, కంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం పనులు నిలిచిపోయాయన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం బంజారా కాలనీలో నిర్వహించిన గిరిజనోత్సవాలలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో గిరిజనుల జీవితాలల్లో వెలుగులు నింపేందుకు తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చారని, ఒక్కో పంచాయితీ భవనం నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు, ఆదివాసులకు పట్టాలు ఇచ్చేందుకు నిర్ణయించారని తెలిపారు. ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతం పెంచి వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ మారుతీ దివాకర్, మాజీ కార్పొరేటర్ సామతిరుమల్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, నక్క రవిందర్‌గౌడ్, భాస్కర్‌సాగర్, గుడాల మల్లేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజారుల్లో కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో) టమాట 39, వంకాయ 33, బెండ 40, పచ్చి మిర్చి 85, కాకర 45, బీర 35, క్యాబేజి 15, ఫ్రెంచిబీన్స్ 75–105, క్యారెట్ 50, దొండ 25–28, చిక్కుడు 85, గోకర 45, బీట్‌రూట్ 34, క్యాప్సికం 70, ఆలు 20, దోస 18, సొర 11, పొట్ల 13, ఉల్లి 19, చామగడ్డ 35. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయాన్ని పరిశీలిస్తున్న లింగాల హరిగౌడ్

సైదాబాద్: ఆలయ పునరుద్ధరణకు కృషి చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ తెలిపారు. సైదాబాద్ డివిజన్ ఆస్మాన్‌ఘడ్ గాంధీనగర్‌లోని అమ్మవారి ఆలయం సమీపంలోని భారీవృక్షాల వేర్ల ధాటికి భూమి కృంగిపోయి ఆలయం దెబ్బతిన్నది. సమాచారం తెలుసుకున్న హరిగౌడ్ శనివారం ఆలయాన్ని సందర్శించారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయం తిరిగి యథాస్థితికి చేరేందుకు తనవంతు సహాయం అందిస్తానన్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం..



మలక్‌పేట పోలీస్‌స్టేషన్ లైన్‌లో పేరుకుపోయిన చెత్త

మలక్‌పేట: అక్బర్‌బాగ్ డివిజన్‌లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. చెత్త క్రమంగా తొలగించకపోవడంతో పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుంది. మలక్‌పేట పీఎస్ నుంచి మెట్రో స్టేషన్‌కు వెళ్లే దారిలో, బీ–బ్లాక్ క్వార్టర్స్ ప్రాంతాలలో ఈ పరిస్థితి నెలకొంది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ క్వార్టర్స్ ముందు చెత్త కుప్పలు పేరుకుపోయాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడి సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. శానిటేషన్ అధికారులు చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పేరుకుపోయిన చెత్తను క్రమంగా తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బీజేపీలో అందరికీ తగిన ప్రాధాన్యం



మాట్లాడుతున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

సైదాబాద్: పార్టీ పటిష్టతకు పాటుబడిన నాయకులు, కార్యకర్తలు అందరికీ బీజేపీలో తగిన ప్రాధాన్యం లభిస్తుందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని పద్మావతి కల్యాణ మండపం హాల్‌లో మహా జన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన మలక్‌పేట నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. దేశప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. దేశంలోని అన్నివర్గాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో పార్టీకి సీనియర్ నాయకుల సేవలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, కార్పొరేటర్‌లు అరుణరవీందర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరిగౌడ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన అలీకి రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి శనివారం పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూధన్ రెడ్డి, శేఖర్‌ముదిరాజ్, పగడాల శ్రీశైలం, హరి, శ్రీధర్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, శ్రావణ్, జహంగీర్, విజయ్, అనుదీప్, మాచర్ల వరుణ్, ప్రభు, కలిధ్ భాయ్, శివ, విప్లవ్, వేణు, పాండు, నగేష్ పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో 'అపోలో' మెడికల్ అకాడమీ ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

చైతన్యపురి: దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ ఫలితాల్లో చైతన్యపురిలోని అపోలో మెడికల్ అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు డైరెక్టర్ పోసిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పి.ప్రణతి 685/720 మార్కులు సాధించిందని 280 మంది నీట్ పరీక్షకు హాజరు కాగా 12 మంది ఎయిమ్స్‌కు ఎంపికవ్వగా 181 మంది ఉచిత మెడికల్ సీట్లు సాధిస్తారన్నారు. తమ అకాడమీ నుంచి హాజరైన ప్రతి ముగ్గురిలో ఇద్దరు మంచి ర్యాంకులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపల్ అల్వాల మధుసూదన్, అధ్యాపకులు శ్రీధర్, గోవర్ధన్‌రెడ్డి, కేవీఆర్‌రాజు, మూర్తి, వంశీకృష్ణ, రోహిత్ అభినందించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లో సాయి బాలాజీ హోమ్స్ కాలనీలో నిర్మాణ దశలో ఉన్న సీసీ రోడ్డు పనులను శనివారం మేయర్ చిగురింత పారిజాత పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే ఈ కాలనీలో 90 శాతానికి పైగా పనులు పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన పనులు కూడా పూర్తి చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

నవ చైతన్య యువజన సంఘం కార్యాలయంలో నాగోలు ఠాణా



నాగోలు: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నాగోలులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పోలీస్ స్టేషన్‌కు తాత్కాలిక భవనాన్ని ఎంపిక చేశారు. నాగోలులోని నవ చైతన్య యువజన సంఘం భవనంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పోలీస్ శాఖ అధికారులు పోలీస్ స్టేషన్ సంధించిన బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ నెల 22న నాగోలు పోలీస్ స్టేషన్ ప్రారంభించే అందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు కావాల్సిన వసతులు, ఫర్నిచర్‌ను పోలీస్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. నవ చైతన్య యువజన సంఘం సభ్యుల కోసం అదే భవనంపై మరో అంతస్తుకు నిర్మించేందుకు ప్రత్యేక నిధులను మంజూరు చేయిస్తానంటూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు.

కోర్టు ఆవరణలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న న్యాయమూర్తి నందికొండ నర్సింగ్ రావు

రంగారెడ్డి కోర్టులు: హైకోర్టు ఆదేశాలను అనుసరించి శనివారం రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం అధ్యక్షులు నందికొండ నర్సింగ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరికృష్ణ భూపతి, మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి డా. పట్టాభిరామారావు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు రవీందర్, కార్యదర్శి పట్లోళ్ల మాధవ రెడ్డి, ఆరోగ్య రీత్యా సూచనలు సలహాలు చేశారు.

సాయి ఆలయ ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీదుర్గ



ప్రమాణస్వీకారం చేస్తున్న లక్ష్మీదుర్గ

చైతన్యపురి: దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయ నూతన ప్రధాన కార్యదర్శిగా పర్వతనేని లక్ష్మీదుర్గ ప్రమాణ స్వీకారం చేశారు. ఎలక్షన్ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య లక్ష్మీదుర్గచే బాబా సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పూర్తి సమయం కేటాయించి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుండమల్లయ్య, మాజీ చైర్మన్‌లు డాక్టర్ లింగయ్య, వూర నర్సింహగుప్తా, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలో సత్తా

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ నాగార్జున ది నెక్స్ట్ జెన్ పాఠశాలకు చెందిన ఆర్యన్‌గౌడ్, త్రినయ్‌గౌడ్ సాఫ్ట్‌బాల్ క్రీడలో పాల్గొని జాతీయస్థాయిలో తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో జరిగిన జాతీయస్థాయి పోటీలలో తెలంగాణా రాష్ట్ర జట్టు తరఫున వీరు పాల్గొని పతకాలు సాధించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆర్యన్‌గౌడ్, త్రినయ్‌గౌడ్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నిబంధనలు పాటించని కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మలక్‌పేట: ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఎల్‌బీనగర్ విభాగ్‌కన్వీనర్ అంకం శ్యామ్‌కిరణ్ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని నారాయణ స్కూల్ గడ్డిఅన్నారం బ్రాంచ్‌లో పాఠ్యపుస్తకాల అమ్మకాన్ని, అధిక ఫీజులు వసూలు చూస్తున్నారని ఏబీవీపీ దిల్‌సుఖ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్కూల్ గేట్ ముందుకు పాఠ్యపుస్తకాలతో ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1994లో ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్–1 ప్రకారం ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యాసంస్థలు పని చేయాలని చెబుతున్నా.. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ధనార్జనే ధ్యేయంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డొనేషన్లు, స్పెషల్ ఫీజు, బస్సు, యూనిఫామ్ ఫీజులు, బుక్స్ ఫీజుల పేరుతో అందిన కాడి దండుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏబీవీపీ నాయకులు సరూర్‌నగర్ మండల విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అక్కడికి చేరుకున్న అధికారి రమేష్ స్కూల్ బుక్స్, పాఠ్యపుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేసినట్లు తెలిపారు. విద్యార్థి నాయకులు మహేష్, అజయ్, అనిల్, అంజి, రంజిత్, నందు, సందీప్, శివ, నవీన్, శివకుమార్ పాల్గొన్నారు.

నంబర్‌లేని వాహనాలపై తిరిగితే చర్యలే



సీఐ జలేందర్‌రెడ్డి

హస్తినాపురం: నంబర్ ప్లేట్లు లేని ద్విచక్రవాహనాలపై తిరుగుతూ గొలుసు దొంగతనాలు, అనేక నేరాలకు పాల్పడుతున్నారని అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరస్తులు తాము చేసిన నేరాలను గుర్తు పట్టకుండా పోలీసుల నుంచి తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్లు లేని వాహనాలను ఉపయోగిస్తున్నట్లు తమ విచారణలో గుర్తించామన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని అనేక ప్రాంతాలలో ట్రాఫిక్ పోలీసులు, తాము సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ ముమ్మరం చేసి ఎక్కడికక్కడ వాహనాల తనిఖీలు చేపడుతున్నామన్నారు.

నేడు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని హౌసింగ్ బోర్డు, సర్దార్‌నగర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి సబితారెడ్డి ఆదివారం శంకుస్థాపన చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీ ఉదయం 11–30 గంటలకు పార్కు పనులకు, మధ్యాహ్నం సర్దార్‌నగర్‌లో సైడ్ లైటింగ్, సీసీ రోడ్డు, శాలివాహన సంఘం కమ్యూనిటీ భవనం, ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ భవనాలకు శంకుస్థాపనలు, ఎల్లమ్మ ఆలయం సైడ్ లైటింగ్ తదితర పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది హాజరుకావాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

వ్యక్తి ఆత్మహత్య

హయత్‌నగర్: పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. హయత్‌నగర్ డివిజన్ పెద్దమ్మగుడి కాలనీలో నివసించే దాసరమోని భాస్కర్(38) శ్రీచక్రధర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గతేడాది ఆయన భార్య అనారోగ్యంతో మృతి చెందింది. వారి కూతురును అమ్మమ్మ వారి ఇంటికి పంపించిన భాస్కర్ ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. భార్య మృతి చెందినప్పటి నుంచి మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. అక్కడక్కడ అప్పులు చేసి తెలిసిన వారికి ఇప్పించాడు. అప్పులు ఇచ్చిన వారినుంచి ఒత్తిడి ఎక్కువైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం మునుగనూరు సమీపంలో మల్లన్నగుట్ట దగ్గర కాలువ పక్కన చెట్ల పొదల్లో భాస్కర్ మృతదేహాన్ని చూసిన గొర్ల కాపరుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

చెరువులో దూకి మహిళ..

చంపాపేట: చెరువులో దూకి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓల్డ్ మలక్‌పేటకు చెందిన విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ రఫీక్ ఉజ్మా భార్య రేష్మాబేగం (60) అనారోగ్యంతో బాధ పడుతుండేది. పలువురి వైద్యులను సంప్రదించినా ప్రయోజనం లేకపోగా సమస్య మరింత పెరిగింది. దీంతో మనస్తాపానికి గురైన రేష్మాబేగం శనివారం సరూర్‌నగర్ చెరువు వద్దకు వచ్చి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కూతురు సాజియాకు ఫోన్ చేసి సమాచారం అందించి ఫోన్‌ను చెరువు గట్టుపై ఉంచి చెరువులో దూకింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరి నీటిలో మునిగిపోయిన రేష్మాబేగాన్ని ఒడ్డుకు చేర్చారు. అప్పటికే ఆమె మృతి చెందటంతో పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.